నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 16 మే 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

## పోలీస్ యంత్రాంగం కృషి అభినందనీయం

- ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు
- కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్‌కుమార్


మాట్లాడుతున్న ఎస్పీ సురేశ్ కుమార్

ఆసిఫాబాద్ టౌన్, మే15 : పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడంలో పోలీసు యంత్రాంగం కృషి అభినందనీయమని జిల్లా ఎస్పీ సురేశ్ కుమార్ అన్నారు. బుధవారం విలేకరులతో ఎస్పీ మాట్లాడారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా పటిష్ట బందోబస్తు మధ్య ఎన్నికలను విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, కోడ్ ఆఫ్ కండక్ట్ టీములు, చెక్ పోస్టులు, సివిల్ పోలీస్, స్టాటికల్ సర్వైవ్ లెన్స్ సిబ్బంది, అధికారులు, మహిళా సిబ్బంది, హోంగార్డులు, ట్రెయినీ కానిస్టేబుళ్లు, సీఆర్పీఎఫ్ పోలీసులు, అధికారులు మొత్తం 2000 మందితో బందోబస్తు నిర్వహించినట్లు తెలిపారు.

## ధాన్యం తూకం వేయించిన అధికారులు

నమస్తే ఎఫెక్ట్

దండేపల్లి, మే15: 'ధాన్యం కొనండి మహాప్రభో..' అనే శీర్షికన నమస్తే తెలంగాణలో ప్రచురితమైన కథనానికి ఐకేపీ అధికారులు బుధవారం స్పందించారు. దండేపల్లి మండలంలోని వందూర్‌గూడకు చెందిన రైతుల ధాన్యాన్ని తానిమడుగు ఐకేపీ సెంటర్‌లో బుధవారం తూకం వేశారు. నెల రోజులుగా కొనుగోలు కేంద్రానికి తరలించిన వడ్లను కొనడం లేదని రైతులు తమ గోడును వెల్లబోసుకున్నారు. బుధవారం ప్రచురితమైన కథనానికి ఐకేపీ అధికారులు, సిబ్బంది స్పందించి వెంటనే హమాలీలతో తూకం వేయించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తూ 'నమస్తే తెలంగాణ'కు కృతజ్ఞతలు తెలిపారు.


వడ్లు తూకం వేస్తున్న సిబ్బంది

# గొల్ల కుర్మల ఆశలు ఆవిరి

- గొర్రెల పంపిణీపై మాటెత్తని కాంగ్రెస్ సర్కారు
- డీడీలు కట్టి ఎదురు చూస్తున్న లబ్ధిదారులు
- పథకం కొనసాగించాలని గ్రామీణుల డిమాండ్


మొదటి విడుతలో అందించిన గొర్రెలతో ఉపాధి పొందుతున్న లబ్ధిదారులు(ఫైల్)

కుమ్రం భీం ఆసిఫాబాద్, మే 15 (నమస్తే తెలంగాణ): తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ సర్కారు హయాంలో 75 శాతం సబ్సిడీపై గొల్ల, కుర్మల కోసం ప్రత్యేకంగా అమలు చేసిన గొర్రెల పంపిణీ పథకం అమలుపై ఆశలు సన్నగిల్లుతున్నాయి. ఈ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందా ? లేదా ? అనేది సందేహంగా మారింది. గొర్రెల పంపిణీకి కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ఈ పథకం కొనసాగకపోవడంపై జీవాల పెంపకంపై ఆధారపడి జీవించే గొల్ల, కుర్మలు ఆందోళన చెందుతున్నారు. గ్రామీణ ప్రాంత ప్రజల కుల వృత్తులకు జీవం పోసిన గత కేసీఆర్ సర్కార్ గొల్ల, కుర్మల సంక్షేమానికి గొర్రెల పంపిణీ పథకాన్ని తీసుకువచ్చింది. అన్ని జిల్లాల్లో గొర్రెల పెంపకంపై ఆధారపడి జీవించే గొల్ల, కుర్మలు ఎంత మంది ఉన్నారనే దానిపై సర్వేలు నిర్వహించింది. 2017లో ఈ పథకాన్ని ప్రవేశ పెట్టింది. కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మొత్తం 4,404 మంది అర్హులను గుర్తించింది. మొదటి విడుతలో 2891 మంది గొర్రెల యూనిట్లని పంపిణీ చేసింది. ఆ తర్వాత రెండో విడుతలో మిగతా లబ్ధిదారులకు అందించేందుకు ఏర్పాట్లు చేసినప్పటికీ కరోనా తదితర కారణాలతో గొర్రెల పంపిణీలో జాప్యం జరిగింది. ఇప్పటికీ 1513 మందికి గొర్రెల యూనిట్లు అందలేదు.

### ఒక్కో యూనిట్‌కు రూ.1.31 లక్షల సబ్సిడీ

ఈ పథకం విలువ రూ.1.75 లక్షలు ఉండగా లబ్ధిదారులు రూ.43,750 డీడీ రూపంలో చెల్లిస్తే మిగతా రూ.1,31250ను ప్రభుత్వం సబ్సిడీని కలిపి గొర్రెలను అందించాల్సి ఉంది. ఒక యూనిట్‌లో 21 గొర్రెలు కాగా వీటిలో 20 గొర్రెలు, ఒక పొట్టేలు ఉంటుంది. రెండో విడుత గొర్రెలు వస్తాయని భావించిన లబ్ధిదారులు తమ వాటా కింద జిల్లాలో 562 మంది లబ్ధిదారులు రూ.43750 చొప్పున డీడీలు కట్టారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా అప్పటి కేసీఆర్ ప్రభుత్వం రెండో విడుత గొర్రెల పంపిణీలో భాగంగా 230 మందికి గొర్రెలను అందించింది. ఆ తర్వాత అనివార్య కారణాలతో మిగతా వారికి గొర్రెల పంపిణీలో జాప్యం జరిగింది.

### డీడీలు కట్టిన 332 మంది లబ్ధిదారులు..

జిల్లాలో గొర్రెల పంపిణీ పథకానికి రెండో విడుతలో 332 మంది లబ్ధిదారులు డీడీలు కట్టి ఎదురుచూస్తున్నారు. మరో 951 మంది లబ్ధిదారులు ఇంకా డీడీలు కట్టలేదు. రెండో విడుతలో కాంగ్రెస్ సర్కారు గొర్రెలు పంపిణీ చేస్తుందో లేదోనని డీడీలు కట్టేందుకు వెనుకాడుతున్నారు. ఇప్పటికే డీడీలు కట్టిన 332 మందికి ఇంకా గొర్రెలు పంపిణీ చేయలేదు. గొర్రెలు ఇవ్వకపోతే కనీసం డీడీలు కట్టిన డబ్బులైనా తిరిగి ఇస్తారో లేదోనని ఆందోళన చెందుతున్నారు. గ్రామీణ పేద గొల్ల కుర్మల కోసం అప్పటి కేసీఆర్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని, దీనిపై స్పష్టమైన ప్రకటన చేయాలని గొల్ల, కుర్మలు, లబ్ధిదారులు డిమాండ్ చేస్తున్నారు.

# లోకల్‌లో ఉండడు.. హైదరాబాద్‌లోనూ దొరకడు..

- ప్రజాస్వామ్యం అంటే ఆ ఎమ్మెల్యేకు గౌరవమే లేదు
- రాష్ట్రంలో ఓటేయని ఏకైక ఎమ్మెల్యేగా రికార్డు
- గెలిపిస్తే స్థానికంగా ముగ్గుపోసి ఇల్లు కడుతా అన్న మాట ఏమైంది..
- ఎమ్మెల్యేపై పెదవి విరుస్తున్న బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలు

మంచిర్యాల, మే 15(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'నన్ను బెల్లంపల్లి ఎమ్మెల్యేగా గెలిపించండి.. గెలిచిన తెల్లారే ఇక్కడనే ముగ్గు పోసి ఇల్లు కడతా అన్నడు.. లోకల్‌లోనే అందుబాటులో ఉంటా అని మాటలు చెప్పిండు.. అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కడికి పోయినా ఇదే మాట చెప్పిండు. పైగా ఎమ్మెల్యే ఎన్నికలప్పుడు స్థానికంగానే ఉంటా అంటూ బాండ్ రిలీజ్ చేసిండు. గెలిచినంక ఆయింత అవతల పడ్డడు. ఆయన్నీ కలవాలంటే లోకల్‌లో ఉండడు.. పోనీ హైదరాబాద్‌లో సార్ ఇంటికి పోయినా దొరకడు' అంటూ బెల్లంపల్లి నియోజకవర్గ ప్రజలు స్థానిక ఎమ్మెల్యే గడ్డం వినోద్‌పై పెదవి విరుస్తున్నారు. ముగ్గుపోసి ఇల్లు కట్టకపోయినా ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్‌లోనైనా ఉండొచ్చు కదా.. ఈ విషయం అడిగితే దానికి వాస్తు దోషం ఉందంటున్నడు. పోయి పోయి టూరిస్టు ఎమ్మెల్యేను గెలిపించుకున్నాం అంటూ వాపోతున్నారు. సార్ లోకల్‌కి వచ్చినా కలవాలంటే మంచిర్యాలకు పోవాల్సి వస్తుందని, అక్కడా దొర్కకపోతే ఐదారువేల రూపాయలు ఖర్చు పెట్టుకుని హైదరాబాద్‌కు పోవాల్సి వస్తుందంటున్నరు. స్థానికంగా నిత్యం ప్రజల్లో ఉండే పాత ఎమ్మెల్యేను వదులుకుని కాంగ్రెస్ హామీలకు ఆశపడి ఓట్లు వేస్తే ఇబ్బందులు తప్పడం లేదంటూ బాధలు చెప్పుకుంటున్న బెల్లంపల్లి జనాలు.



### ప్రజాస్వామ్యంపై గౌరవం ఉండదా..

ఆయన ప్రజలచేత, ప్రజల కొరకు.. ప్రజాస్వామ్యంలో ప్రజల ఓట్లతో గెలిచిన ఎమ్మెల్యే. అందరికంటే ముందు ఆయన ఓటేయాలి.. కానీ, బెల్లంపల్లి ఎమ్మెల్యే మాత్రం ఓటేయలేదు. తమ్ముడి కొడుకును ఓట్లేసి గెలిపించడంటూ ప్రచారం చేసిన పెద్ద మనిషి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటే వేయలేదు. ప్రజాస్వామ్యయుతంగా ఎమ్మెల్యేగా గెలిచిన వ్యక్తి.. ఓటేయకుండా ప్రజాస్వామ్యాన్ని ఏ మాత్రం గౌరవం ఇచ్చారనేది ఇప్పుడు బెల్లంపల్లిలో పెద్ద చర్చనీయాంశంగా మారింది. దీంతో ఆయన గతంలోనూ స్థానికంగా అందుబాటులో లేని అంశాలను జనాలు లేవనెత్తుతున్నారు. ఎన్నికలకు ముందు రంజాన్ తోఫాలు, ఇఫ్తార్ విందులంటూ తిరిగిన ఆయనే.. ఎమ్మెల్యేగా గెలిచినా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు అంటూ వీడియో సందేశం విడుదల చేశారంటూ మండిపడుతున్నారు. ముస్లిం మైనార్టీలకు ఇచ్చే గౌరవం ఇదేనా అంటూ కాంగ్రెస్ పార్టీకి చెందిన ముస్లిం నాయకులే ఆయనపై గుర్రుగా ఉన్నట్లు తెలిసింది. ఎమ్మెల్యే అవసరం ఉన్న ప్రతి సందర్భంలో ఆయన కనిపించడం లేదంటూ నియోజకవర్గ ప్రజలు కోడైకూస్తున్నారు. ఈ ప్రభావం పార్లమెంట్ ఎన్నికల్లో తప్పదని చెప్తున్నారు. ఆయనే నియోజకవర్గాన్ని పట్టుకుని ఉంటే పార్లమెంట్ ఎన్నికల్లో బ్రహ్మాండంగా పని చేసేవాళ్లని.. మరి ఆయనకు ఇష్టంలేదో ఏమో తమ్ముడి కొడుక్కి అంతగా సహకరించలేదని.. ఎమ్మెల్యే ఎన్నికల కోసం చేసినంత కసరత్తు చేయలేదని కాంగ్రెసోళ్లు బాహాటంగానే చెప్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేకు వచ్చిన మెజార్టీ ఎంపీ అభ్యర్థి రాదని.. దానికి కారణం పెద్ద సారు వ్యవహారశైలేననే గుసగుసలు వినిపిస్తున్నాయి. స్థానికత అంశం ఈ ఎన్నికల్లో నానుతుండడంతోనే ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసుకు వాస్తు పేరుతో రిపేర్లు చేయిస్తున్నారని, చేతులు కాలిన తర్వాత ఆకులు పట్టుకునే లాభం ఏంటని చర్చించుకుంటున్నారు. మరీ సారు మీద జనం లోపల ఉన్న ఈ వ్యతిరేకత ఎన్నికల ఫలితాలపై ప్రభావం చూపుతుందా లేదా అనేది మరి కొన్ని రోజుల్లోనే తేలనుంది.

### అక్రమ దందాల్లో కాంగ్రెసోళ్లు

ఎమ్మెల్యేతోపాటు స్థానిక కాంగ్రెస్ లీడర్ల వ్యవహారశైలి కూడా బెల్లంపల్లి నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యేపై ఉన్న కోపానికి అది మరింత ఆజ్యం పోసినట్లు తయారవుతున్నదని కిందిస్థాయి కాంగ్రెస్ లీడర్లు చెప్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నకిలీ పత్తి విత్తనాలు సరఫరా చేసే వ్యవహారంలో బెల్లంపల్లికి చెందిన సీనియర్ కాంగ్రెస్ లీడర్లు ఉన్నారని చెప్తున్నారు. కొన్ని నెలల క్రితం కన్నెపల్లి, భీమిని మండలాల్లో ఓ నకిలీ పత్తి విత్తనాల లారీ లోడ్‌ను పోలీసుల నుంచి తప్పించడంలో ఓ కాంగ్రెస్ లీడర్ కీలకంగా వ్యవహరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ మధ్యకాలంలో అక్రమ రేషన్ దందాను కాంగ్రెస్ లీడర్లు అన్నీ తామై నడుపుతున్నారు. కన్నెపల్లికి చెందిన ఇద్దరు కీలక లీడర్లు రేషన్ డీలర్ల నుంచి నేరుగా బియ్యాన్ని తీసుకెళ్లి పక్క రాష్ట్రంలో వదులుతున్నారు. అంతకుముందు ఈ దందా తాండూర్, రెబ్బెన కేంద్రంగా సాగితే ఇప్పుడు కన్నెపల్లి మండలం కేంద్రంగా చేసుకుని ఓ ఇద్దరు కాంగ్రెస్ నాయకులు దందాను నడిపిస్తున్నట్లు తెలుస్తున్నది. ఇలా ప్రతి అక్రమ దందాలోనూ కాంగ్రెసోళ్లు జోక్యం చేసుకోవడం కూడా బెల్లంపల్లిలో ఆ పార్టీకి మైనస్‌గా మారింది. మరి ఇప్పటికైనా ఎమ్మెల్యే సారు.. స్థానికంగా అందుబాటులో ఉంటూ.. వాళ్ల లీడర్లను కంట్రోల్ పెడతారా లేదా చూడాలి మరీ.

## వివాహేతర సంబంధం.. ప్రియుడి దారుణ హత్య


మల్యాల నరేశ్ (ఫైల్)

హాజీపూర్, మే 15 : వివాహేతర సంబంధం..ఓ వ్యక్తి హత్యకు దారి తీసిన సంఘటన హాజీపూర్ మండల కేంద్రంలో మంగళవారం రాత్రి జరిగింది. హాజీపూర్ ఎస్ఐ, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..హాజీపూర్‌కు చెందిన మల్యాల నరేశ్ (32) గతంలో పెట్రోల్ బంక్‌లో పని చేసి ప్రస్తుతం ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి వివాహితతో పరిచయం..వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం తెలుసుకొని నరేశ్‌కు భార్య దూరంగా ఉంటున్నది. సదరు వివాహితకు ఆమె భర్త కూడా దూరంగా ఉంటున్నాడు. వివాహేతర సంబంధం విషయమై పలు మార్లు పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీలు జరిగాయి. అయినా వీరి ప్రవర్తనలో మార్పు రాలేదు. నరేశ్‌ను వివాహిత సోదరుడు ఆసాది చైతన్య పలుమార్లు హెచ్చరించాడు. అయినా వీరు వినలేదు. మంగళవారం రాత్రి వీరిద్దరూ కలిసి ఉండడాన్ని చైతన్య గమనించాడు. అక్కడ జరిగిన గొడవలో నరేశ్‌ను చైతన్య నెట్టి వేశాడు. కింద పడిన నరేశ్ తలపై చైతన్య బండరాయితో కొట్టడంతో తీవ్ర రక్త స్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న మంచిర్యాల రూరల్ సీఐ ఆకుల అశోక్, హాజీపూర్ ఎస్ఐ సురేశ్ కుమార్ అక్కడికి చేరుకొని మృతదేహాన్ని మంచిర్యాల ప్రభుత్వ దవాఖానకు తరలించారు. నరేశ్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. నరేశ్‌కు భార్యతో పాటు కూతురు నిరీష ఉన్నారు.

## డెంగీ నివారణకు ప్రత్యేక చర్యలు

మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతీలాల్



ఫ్లెక్సీ, కరపత్రాలు విడుదల చేస్తున్న అదనపు కలెక్టర్ మోతీలాల్

నస్పూర్, మే 15 : జిల్లాలో డెంగీ వ్యాధి వ్యాప్తి చెందకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు మంచిర్యాల అదనపు కలెక్టర్ మోతీలాల్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ చాంబర్‌లో వైద్య ఆరోగ్య శాఖ ఇన్‌చార్జి అధికారి అనిత, మాస్ మీడియా అధికారి బుక్కా వెంకటేశ్వర్లుతో కలిసి డెంగీ వ్యాధి నివారణపై ఫ్లెక్సీ, కరపత్రాలను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16న జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా డెంగీ వ్యాధి వ్యాప్తి, నియంత్రణ, చికిత్సపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పల్లె దవాఖానలు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలు, ఉప కేంద్రాలకు కరపత్రాలు, ఫ్లెక్సీలు, పోస్టర్లను పంపించినట్లు తెలిపారు. ఇండ్ల పరిసరాల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సాంకేతిక పర్యవేక్షకుడు సంతోష్, అధికారులు పాల్గొన్నారు.

## నేటి నుంచి సమ్మర్ కోచింగ్ క్యాంపు

ఆసిఫాబాద్ అంబేద్కర్‌చౌక్, మే 15: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 31 వరకు నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ సమ్మర్ స్పోర్ట్స్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా, ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి బుధవారం ప్రకటనలో తెలిపారు. 2023-24 సంవత్సరంలో కుమ్రం భీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లోని ఆశ్రమ పాఠశాలలకు చెందిన ప్రతిభ గల 60 మంది బాలురు, 60 మంది బాలికలను ఎంపిక చేసినట్లు గిరిజన క్రీడల అధికారి బండ మీనారెడ్డి తెలిపారు. ఎంపికైన క్రీడాకారులందరూ క్యాంప్‌నకు సకాలంలో హాజరు కావాలని సూచించారు. అథ్లెటిక్స్, హ్యాండ్ బాల్, ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, బాక్సింగ్‌లో శిక్షణ ఇస్తామని తెలిపారు. ఉదయం, సాయంత్రం వేళల్లో శిబిరం కొనసాగుతుందని తెలిపారు.

## బందోబస్తు మధ్య రిజర్వ్ ఈవీఎంల తరలింపు


మార్కెట్ యార్డులోని గోదాంను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, మే 15 : లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన రిజర్వ్ ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను భారీ బందోబస్తు మధ్య స్ట్రాంగ్ రూం నుంచి ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులోని ఈవీఎం గోదాంలోకి తరలించి భద్రపర్చుతున్నట్లు కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్, ఎన్నికల అధికారి వెంకటేశ్ ధోత్రే తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మార్కెట్ యార్డులో ఈవీఎం గోదాంను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలోని సిర్పూర్, ఆసిఫాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్లలో పోలింగ్ కో సం రిజర్వ్‌లో ఉంచిన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను మార్కెట్ యార్డులోని ఈవీఎం గోదాంలో భద్రపర్చుతున్నామని తెలిపారు. గోదాం వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా ఉంచాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ తహసీల్దార్ శ్రీనివాస్‌రావు దేశ్ పాండే, నాయబ్ తహసీల్దార్ జితేందర్, రాజకీయ పార్టీల ప్రతినిధులు , తదితరులు పాల్గొన్నారు.

## హరితహారానికి ఏర్పాట్లు చేయాలి

మంచిర్యాల అడిషనల్ డీఆర్డీవో దత్తారావు


మాట్లాడుతున్న అడిషనల్ డీఆర్డీవో దత్తారావు

తాండూర్, మే 15 : జూన్‌లో చేపట్టే హరితహారం కార్యక్రమానికి ముందస్తుగా ఏర్పాట్లు చేయాలని అధికారులు, సిబ్బందిని అడిషనల్ డీఆర్డీవో దత్తారావు ఆదేశించారు. అభివృద్ధి పనులపై తాండూర్ మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో ఎంపీడీవో పీ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో చేపట్టే హరితహారం కార్యక్రమానికి ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. స్థలాలను గుర్తించి గుంతలు తవ్వాలని తెలిపారు. ప్రతి గ్రామంలో 200 మందికి పైగా ఈజీఎస్ కూలీలు హాజరయ్యేలా చూడాలని, ప్రతి ఒక్కరికీ రోజుకు రూ.300 చొప్పున కూలి వచ్చేలా పనులు చేయించాలన్నారు. అనంతరం ఓహెచ్ఎస్ఆర్, మిషన్ భగీరథ, బోర్‌వెల్ మోటార్లను పరిశీలించారు. నీటి ఎద్దడి లేకుండా చూడాలన్నారు. పారిశుధ్య పనులపై నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో సత్యనారాయణ, ఏపీవో నందకుమార్, కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కొనుగోలు కేంద్రం నిర్వాహకుడిపై సస్పెన్షన్‌కు సిఫారసు

- కాంటాలో లోపాల గుర్తింపు
- డీసీఏవో మహ్మద్ రబ్బాని


మాట్లాడుతున్న డీసీఏవో మహ్మద్ రబ్బాని

దహెగాం, మే 15 : ధాన్యం తూకంలో మోసం ఘటనలో సహకార సంఘం అసిస్టెంట్ సీఈవో, ఒడ్డుగూడ వరి ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు తుమ్మిడ నారాయణను సస్పెన్షన్ చేసేందుకు సిఫారసు చేసినట్లు కుమ్రం భీం ఆసిఫాబాద్ డీసీఏవో మహ్మద్ రబ్బాని తెలిపారు. బుధవారం సహకార సం ఘం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఒడ్డుగూడలో వరి ధాన్యం తూకంలో మోసం చేస్తున్నట్లు మంగళవారం రైతులు ఆందోళన చేయడంతో పాటు కలెక్టర్‌కు ఫిర్యా దు చేశారు. ఈ ఘటనపై వివిధ పత్రికల్లో కథనాలు వచ్చాయన్నారు. ఈ విషయంపై బుధవారం విచారణ చేపట్టగా కాంటాలో లోపాలున్నట్లు తేలిందన్నారు. ఆ విషయంపై కొనుగోలు కేంద్రం నిర్వాహకుడు నారాయణ పట్టించుకోకపోవడాన్ని విధుల్లో నిర్లక్ష్యంగా పరిగణించామని తెలిపారు. ఇంతకు ముందు కూడా 220 క్వింటాళ్ల ధాన్యాన్ని మిల్లుకు పంపించారని, అందుకు సంబంధించిన తూకంపై కాంటాను పరిశీలించగా నాలుగు క్వింటాళ్ల ధాన్యం అదనంగా వచ్చినట్లు గుర్తించినట్లు తెలిపారు. అదనంగా వచ్చిన ధాన్యానికి సంబంధించిన డబ్బులను సదరు రైతులకు అందిస్తామని తెలిపారు. నారాయణ సస్పెన్షన్ సిఫారసును జిల్లా కమిటీకి పంపించామన్నారు. కమిటీ నివేదిక ఆధారంగా తదుపరి చర్యలుంటాయని పేర్కొన్నారు.

## నాటు బాంబు పేలి ఎద్దుకు తీవ్ర గాయాలు


నాటు బాంబు పేలి గాయపడిన ఎద్దు

కౌటాల, మే 15 : మండలంలోని మొగఢ్దగఢ్ గ్రామంలోని ఎల్ములే జిత్రు అనే రైతుకు చెందిన ఎద్దు బుధవారం నాటు బాంబు( గోలీలు) పేలిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడింది. బుధవారం ఉదయం గ్రామ శివారులో మేత మేస్తుండగా అడవి పందుల కోసం అమర్చిన నాటు బాంబు పేలి ఎద్దు మూతి, నాలుక, దవడ భాగం పూర్తిగా రాలిపోయింది. దీంతో ఎద్దు తీవ్ర రక్త స్రావంతో ఇంటికి వచ్చింది. ఎద్దును చూసి జిత్రు ఆవేదనకు గురయ్యాడు. గత మార్చిలో ముత్తంపేటలోని జాడి విలాస్‌కు చెందిన రైతు ఎద్దు, మరో రైతుకు చెందిన ఎద్దుకు కూడా ఇలాగే నాటు బాంబు పేలుళ్లలో గాయాలై మృతి చెందాయి. ఇప్పటికైనా అటవీ శాఖ అధికారులు, పోలీసులు స్పందించి వన్య ప్రాణుల కోసం నాటు బాంబులు అమర్చే వేటగాళ్లను పట్టుకొని కఠినంగా శిక్షించాలని స్థానిక రైతులు కోరుతున్నారు.


వృథాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

## మిషన్ భగీరథ..నీటి వృథా

సిర్పూర్ (యూ), మే 15 : ఇంటింటికీ తాగునీరందించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం కోట్లాది రూపాయల ఖర్చుతో తీసుకువచ్చిన మిషన్ భగీరథ పథకంపై అధికారుల పర్యవేక్షణ కరువైందని ప్రజల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిర్పూర్ (యూ) మండలంలోని మహాగాం గ్రామపంచాయతీ పరిధిలోని అల్లీగూడ సమీపంలో మిషన్ భగీరథ పైప్‌లైన్ పగిలి రెండు రోజుల నుంచి నీరంతా వృథాగా రోడ్డుపై పారుతున్నది. అయినప్పటికీ అధికారులు, సిబ్బంది పట్టించుకోవడం లేదని గ్రామస్తులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పైప్‌లైన్‌కు మరమ్మతులు చేసి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.




